# ఘోరమైన నేరం

"ఆ పిల్లలకి పరీక్షలు, వాళ్ళెందుకు బెంగుళూరికి?" అంది మా ఆవిడ. బెంగుళూరులాంటి చోటికి పోతున్నప్పుడు పెళ్లాం మాత్రం ఎందుకు కూడా – అని లోపల అనుకుని పైకన్నాను–

"అదికాదు సుచీ! నేను ఆఫీసు పనిమీద తిరుగుతుంటే నీకు కాలక్షేపం ఎల్లాగ? ఏదో కార్లో పోతాం. ఒక్క వారం రోజుల్లో – పెద్దవాళ్ల చదువులు మాత్రం ఏం పోతాయేం?"

"మీరలా పిల్లల్ని రెచ్చగొట్టకండి. అమ్మ వొస్తుందీ సాయంత్రం. ఇంట్లో వంటావిడుంది. మనమిద్దరం బెంగుళూరు వెళ్ళి ఇరవై ఏళ్ళయింది. అప్పుడు మనమిద్దరమే వెళ్ళాం" అంది మా ఆవిడ – మా పెళ్ళయిన కొత్తరోజులు తలుచుకుంటూ.

పిల్లలు కూడా ఉంటే, మా ఇద్దరి మధ్యా అడ్డని మా ఆవిడ అభిప్రాయం. వాళ్ళుంటే వాళ్ళ బాధ్యత మా ఆవిడమీద వొదిలిపెట్టి నేను కాస్త స్వేచ్ఛగా తిరగొచ్చని నా ఆశ. అయితే మా ఆవిడ ఒక నిర్ణయానికొచ్చాక దాన్ని మార్చడం మహాకష్టం.

ఇరవై ఏళ్ళక్రితం బెంగుళూరు పోయినప్పుడు నాకూ సుచీకీ మధ్య ఎవరూ ఉండడం నాకే ఇష్టంలేదు. అప్పుడు పరిస్థితులు వేరు. ఇప్పుడైనా ఏ హైదరాబాదులోనో అయితే, రోజుకొకరి ఇంటివద్ద ఆవిణ్ని వొదిలేసి నేనింకోరి ఇంటికి పోతున్నానని చెప్పి, నెలరోజులు గడపొచ్చు. అంతమంది బంధుమిత్రు లున్నారక్కడ.

సుచీ మీద నాకు తగినంత ప్రేమ లేదని మీరు అపోహపడుతున్నారేమో. అది శుద్ధ పొరబాటు. సుచీ నా ప్రాణానికి ప్రాణం. మహాచురుకైనది. నలుగురు పిల్లల తల్లయినా కొత్త పెళ్ళికూతురులా తయారవగలదు. అమ్మో, ఆ నవ్వులో ఎంత కొంటెతనం, ఎంత హుందా ఉన్నాయని! ఆ కళ్ళలోతు కొలవడానికి ఇరవై ఏళ్ళు ఈ మేధావి తంటాలు పడి ఈనాటికింకా కృతకృత్యుడు కాలేదంటే, అటువంటి స్త్రీ వ్యక్తిని గురించి వేరే చెప్పాలా? సుచీ అంటే, నాకు గౌరవం, భక్తి – భయం కూడా.

భయం ఎందుకంటారా? చెపుతా?

నా పెళ్ళయిన వారం రోజులకి, – మేం బెంగుళూరు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్న తరువాత – రావు దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది.

"గోపూ, నీకు పెళ్ళయిందంటే మా స్నేహితుడొకడు ఖర్చయిపోయాడనుకో మంటావా? అలా కాలేదని రుజువు చేసుకోవాలంటే ఎల్లుండి సాయంత్రం నేనక్కడ దిగుతున్నాను. స్టేషనుకిరా. మళ్ళీ ఇంటికి ఎప్పుడు నువ్వు తిరిగి వెళ్ళేదీ నీకే తెలియని స్థితిలో రావాలి."

ఇట్లు,
నీ–రావు.

నా గుండె గుభేలుమంది. ఇటు కొత్తగా పెళ్ళయిన పెళ్ళానికి నా అనురాగాన్ని రుజువు చేసుకోవాలా? పదేళ్ళు విచ్చలవిడిగా రాత్రీ పగలూ తిరిగిన స్నేహితునికి నా అనుబంధాన్ని రుజువు చేసుకోవాలా? రెండూ తెంపరాని బంధాలే.

రావూ నేనూ ఎన్నోచోట్ల ఎన్ని రాత్రులు గడిపామో – చెరపడానికి సాధ్యంకాని స్మృతులవన్నీ. ఉప్పాడలో సముద్రతీరం – రామవరప్పాడులో సరుగుడుతోట – ఏలూరు కొవ్వూరుల మధ్య ఎక్కడో ఒక ధాన్యంమర – మరెక్కడో ఒక టి.బి, హోటల్ గది – ప్రతి చోటుకీ ఒక చరిత్ర వుంది. ఆ చరిత్రలో ఎందరో వ్యక్తులున్నారు. ఎన్నో చిత్ర విచిత్రమైన సంఘటనలున్నాయి. ఆనందం, భయం, స్పర్ధ, ఆవేశం, తృష్ణ ఈసు, ఎన్నెన్నో అనుభవాలు. ఈనాడు అవి మననం చేసుకుంటే, మిగిలేది మనస్సుని మెత్తగా కరిగించే ఒక సంతృప్తి. ఇదంతా కాదంటే, నాలో ఇక మిగిలేది ఏముంది?

అంచేత స్టేషనుకి వెళ్ళాను. ఎప్పుడింటికి వెళ్ళేదీ తెలియని స్థితిలో కాదు. పదిగంటలకల్లా ఇంటికి వెళ్ళి సుచీకి క్షమార్పణ చెప్పుకునో, బతిమాలో, ఆమెను సుముఖురాలిని చేసుకోవాలన్న దృఢనిశ్చయంతో.

పన్నెండింటికి, లేవలేని స్థితిలో ఉన్న రావుని తీసుకుని ఇంటికి వెళ్ళాను. రహస్యంగా అమ్మకి తెలియకుండా సుచీని లేపాను. సంగతంతా చెప్పాను.

"మీరూనా?" అంది సుచీ.

"కొంచెం. లేకపోతే వాడంతా తాగేస్తాడు. ఇంక అసలు లేవలేడని" అన్నాను నేను – తాగినందుకు కార్యకారణ సంబంధాన్ని వెతుక్కుంటూ.

"పాపం" అంది సుచీ. అందులో కాస్త వెటకారం, కాస్త అసహ్యం – 'మీ మగపీనుగులంతా ఇంతే' నన్న ఈసడింపుతో కూడిన సానుభూతి. అన్నీ మహా చక్కని పాళ్ళలో కలిసి నన్ను చిత్తుచేశాయి. పద్దెనిమిదేళ్ళ సుచీ ఎంత ధీమాతో తాగి వచ్చిన కొత్త మొగుణ్ని, తప్పతాగి పడిపోయిన అతని స్నేహితుణ్నీ ఎలా ఆ రాత్రి సమర్థించిందో తలుచుకుంటే, ఈనాటికి నా మనస్సు కృతజ్ఞతతో నిండిపోతుంది. మర్నాడు అనుకున్న ప్రకారం బెంగుళూరు వెళ్ళిపోయా మనుకోండి. అది వేరే విషయం.

అయితే రావంటే మా ఆవిడకి కొంత వ్యతిరేక భావం. అతని జోరుకి మగ స్నేహితులే చాలామంది తట్టుకోలేరు. వాళ్ళ భార్యలు – ఎంత భూదేవతలైనా – ఎలా తట్టుకోగలరు? వొచ్చిన చిక్కేమంటే, రావు బెంగుళూరు వొస్తున్నాడు. నేనున్న వారంరోజులూ అక్కడే వుంటాడు. ఆ సంగతి మా ఆవిడికి తెలీకుండా ఉండదు. రావు అసలు ఒక వూళ్ళోకి వచ్చాడంటే, ఆ ఊరికి తెలీకుండా ఎల్లా ఉంటుంది? అయినా నా అంతట నేను సుచీకి ఈ విషయం చెప్పలేదు. ఆమె ఎలాగా తెలుసుకుంటుంది. విషమ పరిస్థితి ఏదన్నా వొచ్చినప్పుడు, దానికి పరిష్కార మార్గం అప్పుడే ఆలోచిద్దామని నిర్ణయించుకున్నాను.

నలభైయోపడి దాటాక కొన్ని సదుపాయాలు కోరుతుంది శరీరం. ఇరవయ్యోపడిలో నిద్రాహారాల సంగతి, ఎండ, కొండల సంగతి ఆలోచించి ఎరగం. చలీలేదు. వానాలేదు, ఏ అరుగుమీదో, ఏ చెట్టుకిందో నిద్రొచ్చినప్పుడు నడుం వాల్చేవాళ్ళం. ఇంటినుంచీ,

డ్యూటీనించీ ఆటవిడుపైతే చాలు, విశ్రాంతి అక్కర్లేదు. శరీరం ఎంత శ్రమపడ్డా మనస్సూ, ఆత్మ విశ్రమిస్తాయి. ఇప్పుడు కూడా, ఇంటినించీ, ఇల్లాలినించీ కూడా ఆటవిడుపు కోరుతుంది మనస్సు - అయితే పోయే చోటు ఇంటికన్నా సుఖంగా ఉండాలి. పోయేటప్పుడు, చేతికిందికీ, నడుంకిందికీ ఫ్లయోఫోమ్ మెత్తలు కావాలి. వేడి కాఫీ, చల్లని ఐస్‌వాటర్, వేళ పట్టుని వేడి భోజనానికి సదుపాయాలూ అన్నీ కార్లోనే ఉండాలి.

ఇవన్నీ కార్లో అమర్చింది సుచీ, మూడువందల మైళ్ళు కారు ఒక్కణ్ణే తోలడం కష్టం. అదీగాక నేను ఆఫీసు పనిలో ఉన్నప్పుడు సుచీని ఊళ్ళో తిప్పడానికి డ్రైవరు ఉండాలి. సుచీ బాగానే కారు తోలుతుంది గాని, ఒకళ్ళకోసం ఒకళ్ళు ఇబ్బంది పడకుండా డ్రైవర్ని తీసికెళ్ళడానికే నిర్ణయించుకున్నాం.

బెంగుళూరు మాకు అలవాటైన ఊరే. కంటోన్‌మెంటులోనే, జనం ఆట్టే దిగని మారుమూల హోటలొకటుంది. మొదట దాని సంగతి ఆచూకీ తీసినవాడు రావే. అక్కడ దిగాం - నేనూ సుచీ. హోటల్ యజమానికి నన్ను నేను గుర్తుచేసుకున్నాను.

"మిమ్మల్ని ఎలా మరిచిపోతాను సార్" అన్నాడు అతను. అని మా ఆవిడవంక, ఏదో సందేహిస్తున్నట్టు చూశాడు. నాకు మహచెడ్డ చిరాకేసింది. వాడి అభిప్రాయం ఏమిటి? సుచీ ఎవరనుకున్నాడు. నా ఆలోచనలు పూర్తికాకుండానే హోటల్ యజమాని-

"ఒక్కసారి ఇలా రండిసార్" అన్నాడు.

వెళ్ళాను. డ్రాయర్లోంచి ఒక ఉత్తరం తీసి ఇచ్చాడు. అది రావు రాసింది. ప్రొప్రయిటర్ సుచీ వంక అంతల్లా ఎందుకు చూశాడో ఉత్తరం చదివాక అర్థమయింది.

"గోపూ."

అద్భుతమైన పిట్ట. నువ్వామెను తప్పక కలుసుకోవాలి. రాత్రి వొస్తుంది. నాది ఐదోగది. ఈ పక్కనో ఆ పక్కనో నువ్వు తీసుకో -

ఇంతలో సుచీ వొచ్చింది ఆఫీసులోకి. నాకే మనడానికీ తోచలేదు. ఏం చెయ్యడానికీ అంతకన్న తోచలేదు. రావు సంగతి ఆమెకు తెలియదనీ కాదు. ఆమె అధమం ఊహించైనా ఉండదనీ కాదు. అంతే రావు బయటపడిపోతే, ఎందువల్లో నేను కూడా బయట పడిపోయినట్టే ననిపించింది.

"హోటల్లో గదులేవీ కాళీ లేవంటున్నాడు ప్రొప్రయిటరు" అన్నాను చటుక్కున ఆలోచన తోచి. ఎందుకన్నానో ప్రొప్రయిటర్ గ్రహించాడు.

"మేడమీద ఇరవై రెండు కాళీ అయినట్టే. మీ కభ్యంతరం లేకపోతే -" అన్నాడు అతను. ఇంత మంచి కాతా పోగొట్టుకోడం అతనికి ఇష్టంలేదు.

"అయితే ఇంకేం." అంది సుచీ.

అప్పుడే కుర్రవాడు మా సామాను మేడమీదికి పట్టుకుపోతున్నాడు. నేను చేసేది లేక యదాలాపంగా పేర్లున్న బోర్డువంక చూసి-

"ఎవరీ రావు? ఏ వూరు?" అన్నాను ఏమీ తెలియనట్టుగా.

"రాజమండ్రి సార్" అన్నాడు యజమాని.

"సుచీ. మన రావే - ఐదోనంబరు గది" అన్నాను. ఎల్లాగా తెలిసేదే. ముందుకాస్త నేల పదునుచేసి ఉంచితే, ఏ మొక్క మొలిచినా, అంత వింతగా ఉండదని.

"మీకు రాయకుండా వస్తాడేం?" అంది సుచీ – అదో మోస్తరుగా మొహంపెట్టి. మాట వరసకందో, నిజంగానే అనుమానించిందో ఈనాటి వరకూ నాకు తెలియదు. నేను తబ్బిబ్బై పోయాను. అనుకోకుండా జేబులో చెయ్యిపెట్టాను. రావు రాసిన చీటీ ప్రాసిక్యూషన్ తరపు సాక్ష్యంలా తగిలింది చేతికి. తేలు కుట్టినట్టు ఇవతలికి తీసేశాను చెయ్యి. హోటల్ రిజిష్టరులో సంతకం పెడుతున్నంతసేపూ ఆ చీటీ ఎల్లా పారవెయ్యాలా అని ఆలోచిస్తూనే ఉన్నాను. ఆఖరుకి పర్సులో వున్న పెద్ద మొత్తం హోటల్ యజమానికిస్తూ,

"ఇది మీ సేఫ్‌లో దాచండి" అంటున్నప్పుడు, ఈ చీటీ కూడా అతని చేతికిచ్చాను. గదిలోకి వెళ్ళబోతూ వెనక్కు తిరిగి,

"చూడండి. రావు రాగానే చెప్పండి, నేనూ నాభార్యా పై గదిలో ఉన్నామని" అన్నాను.

"రాత్రి ఏ వేళప్పుడొస్తాడో, ఏ పరిస్థితిలో వొస్తాడో మహానుభావుడు. పొద్దున్న చెప్పండి చాలు" అంది సుచీ.

ఆ రాత్రి రెండో ఆటకి సినిమాకి పోయివచ్చాం సుచీ, నేనూ. తనున్నది బెంగుళూరని పూర్తిగా గ్రహించిన డ్రైవరు ఆ రాత్రి మళ్ళీ ఆచూకీ లేడు. మేడ మెట్లెక్కబోతూంటే, ఐదో నెంబరు గదిలో దీపం వెలుగుతూంది. హోటల్ యజమాని లేడు. కునికిపాట్లు పడుతున్న కుర్రవానివంక చూశానుగాని, నా అనుమానాలకి రుజువుగాని, పూర్వపక్షంగాని వాడి మొఖంలో దొరకలేదు. 'పడుకున్న కుక్కల్ని లేపడం మంచిదికాద'న్న ఆంగ్లమేధావి సూక్తిని అనుసరించి కిక్కురుమనకుండా మేడెక్కి సుచీతో మా గదిలో ప్రవేశించాను. ఆ రాత్రి కలతనిద్రలో రావు వచ్చి తెల్లవార్లూ తలుపు తట్టుతున్నట్టు ఒకటే పీడకల. ఆ పీడకలలో ఒక పిట్ట కూడా కూసినట్టు అనుమానం. ఆ పిట్టకోసం మనస్సు తహతహలాడుతుంటే, రావు మా సుచీ ఎదట ఏ అవాకులూ చవాకులూ పేలుతాడో అన్న భయం నిద్రలో నా మెదడుని ఆవిరి పెట్టేసింది. తెల్లవారి శవంలాగ మొగం వాడి పోయి కళ్ళు పీక్కుపోయి ఇరవై లంఖణాలు చేసినవాడిలా లేచాను. కాఫీలో మా ఆవిడికి తెలీకుండా ఒక గుక్కెడు బ్రాందీ కలిపేసి సేవించేదాకా తేరుకోలేదు నేను. ఆ తరువాత మా సుచీ బాత్‌రూంలోకి పోయాక వాకబు చేశా. రావు ఆ పిట్టతోటే వచ్చాట్ట. ప్రొప్రయిటరు లేడట – ఆ సమయానికి. తెల్లారాక ప్రొప్రయిటరు చెప్పాడట మేమొచ్చినట్టు. వెంటనే పిట్టతోసహా హోటల్ కాళీచేసి వెళ్ళిపోయాడట. నేను మొదటిసారి దీర్ఘంగా తాపీగా నిట్టూర్చాను.

ఆఫీసుపని చేస్తూన్నంతసేపూ రావు వస్తాడేమోననీ, అధమం ఫోన్ అయినా చేస్తాడేమోననీ, ఒక పక్క ఆశ, రెండోపక్క ఆందోళన. ఎందుకంటే రావొస్తే బతుకంతా మహా కంగారైన కలగా మారిపోతుంది. ఆ కలలోంచి బయటపడ్డానికి మనస్సు ఒప్పుకోలేదు. కాని రావు వెళ్ళిపోగానే ప్రపంచ సమస్యలంత పెద్దవి బతుకంతా ఆవరించి కొన్నాళ్ళదాకా తలెత్తనీయవు. నా పరధ్యానం చూసి మా బాస్ వేళాకోళం కూడా చేశాడు. కొంచెం బరువైన కంపెనీ సమస్యల చర్చలో పడ్డాకగాని రావుని గురించి మరిచిపోలేకపోయాను.

మధ్యాహ్నం టీ వేళకి వొచ్చింది రావు చీటీ.

"ఒరేయి.

నిన్ను చూస్తే డోకొస్తుంది. ఆమీద దూరాన నిన్నుచూసి, నీ స్నేహితులు తప్పించుకు పోడానికి వీలుగా ఏదన్నా కొట్టొచ్చే రంగులో – మెరిసే ఎరుపైతే నయం – ఒక జెండా లాంటిది కట్టుకు తిరుగు. అసలు ఈ ఊరు నేనొస్తున్నానని తెలిసి, నీ సతీమతల్లిని వెంటబెట్టుకు రావడం మొదటి తప్పు. వస్తివిబో నేను దిగిన హోటల్లోనే నా నెత్తిమీద మంటబెట్టినట్టు – అవిణ్ణి దింపడం క్షమించరాని మహాపరాధం. తస్మాత్ కారణాత్ – నేనీ ఊరు ఒదిలిపోతున్నాను.

బాధా సర్పగ్రస్తుడు,

రావు.

తాజాకలం:– నీ భార్యారత్నాన్ని విమర్శిస్తున్నానని నువ్వు అనుకుంటే నీ కళ్లు పోతాయి. ఆవిడలాంటి మహాపతివ్రతలింకా ఈ దేశంలో ఉండబట్టే మనబోటి పాపులంతా చిరాయువులై తిరుగుతున్నారు. నీబోటి చవట ఆవిడకి భర్త గావడం, భగవంతుడి – అలాంటివాడుంటే సుమా – అవకతవక లీలల్లో ఒకటి అని నా వాదం.

తా–తా–క:– నిన్నొదలను, నువ్వు వెళ్ళేలోగా నీ కాపరం నడివీధికెక్కించకపోతే– రావే–కాదు."

ప్రస్తుతానికి బెంగుళూరుకీ, ఆ పట్టణంలో తాత్కాలికావాసం చేస్తున్న నాకూ రాబోయే పెద్ద ప్రమాదం ఒకటి తప్పింది. రావు ఈ జోరులో నన్ను పట్టుకుంటే, ఎక్కడ ముంచేవాడో, ఎక్కడ తేల్చేవాడో. రావులేని బెంగుళూరు మకాం, కాస్త స్థిమితంగా ఒడుదుడుకులు లేకుండా మెత్తంమీద సుఖంగానే– అంటే అంత అసంతృప్తి లేకండా – సాగిపోతోంది. పగలల్లా కంపెనీ వ్యవహారాలు, మధ్యాహ్నం ఒకో రోజుని భార్యాసమేతంగా పాల్గొనదగిన విందులు, సాయంకాలం అతి మర్యాదగా తొమ్మిది గంటలకి ఆఖరయిా పార్టీలు, ఆ తరవాత కారులో కాస్త షికారు, నేనూ సుచీ. ఆ తరవాత కలతల్లేని, కలవరింతల్లేని నిద్ర. దీన్ని రైలు రోడ్డులాంటి బతుకంటాడు రావు. అయితే ఇందులో ఒక సుఖముంది. అయిపోయిం తర్వాత స్మృతులు మిగలవు. బాధలూ మిగలవు.

రావుని గురించి మీకు పూర్తిగా చెప్పలేదు. అతను కాలేజీలో నా సహాధ్యాయి. అప్పటికే అతనికి పెళ్ళయింది. ఒకళ్లో ఇద్దరో పిల్లలు కూడాను. ఆ రోజుల్లోనే అతనికి పట్టపగ్గాలుండేవి కాదు. అతని భార్య బాగా పల్లెటూరి రకం. ఫలాని పని ఎందుకు చేశావని భర్తని అడగొచ్చని కూడా ఆవిడకు తెలీదు. రావు బొత్తిగా తెలిసిపోయి తప్పులు చేసిన రోజుని నిజంగా పశ్చాత్తాప మొచ్చేదో, ఒచ్చినట్టు నటించేవాడో, ఆవిడ కాళ్ళమీద పడ్డం, ఆవిడ క్షమించానంటేగాని ఒదలి పెట్టకపోవడం ఆచారం. ఒకరోజుని ఈ ప్రదర్శనమంతా నా సమక్షంలో జరిగిన సందర్భంలో, రామాయమ్మ గారూ నేనూ సిగ్గుపడి చచ్చాం.

"అదేవిఁటిది, రోజూ ఇల్లా మొగుడిచేత దణ్ణం పెట్టించుకుంటుంది గావు నీవిడ అనుకుంటారు గోపాలంగారు." అంటూ మహా బాధపడిపోయిం దావిడ. మొగుడు చేసిన

తప్పుకన్నా ఇది పెద్ద శిక్షయిపోయిం దావిడికి. ఆవిడ స్థితి చూసి నేను సిగ్గుపడిపోయాను. ఇల్లా తప్పుచేసిన రాత్రులు, ఆవిణ్ణి మరీ ప్రేమగా చూసేవాడో ఏమో? రావుకి పన్నెండుమంది సంతానం. ఈ మధ్యనే వాసెక్టమీ చేయించుకున్నానని అంటాడు - ఇంకా ఆఖరి ఆడపిల్లకి ఆరునెల్లేగనక, మరో ఏడాది ఆగితేగాని దాని నిజానిజాలు తెలియవు.

రావు శరీరం ఎంత చురుకైనదో బుద్ధి అంత పాదరసంలాంటింది. ఇంత విచ్చలవిడిగా తిరిగే అతను ఎంత చదువు చదివాడో అంచనా వెయ్యడం కష్టం. ఏ విషమమైన చర్చలోనైనాసరే, పాల్గొనడానికి అతనికి అర్హత ఉంది. ఎంత మేధావో అంత చంటివాడు కూడా. అతనిమీద కోపడ్డం మహాకష్టం.

డాక్టరు పరీక్షకి చదవాలని పట్నంవొచ్చి. ఆ సమయానికి ఏం బుద్ధిపట్టిందో- ఆఖరుకి అడ్వకేటయాడు. బోర్డు కట్టాడేగాని, కోర్టు కెళ్ళడం అరుదు. ఏవో అయిదారు పెద్ద కంపెనీ కాతాలున్నాయి. మా కంపెనీకి అతనే లీగల్ అడ్వైజరు. ఆ పని సమర్థంగా చేస్తున్నాడా అన్నది ఎన్నడూ తేలని విషయం. అయితే కంపెనీలకి చట్ట ప్రకారం ఇబ్బందులేవీ అంతగా రాకుండా కంపెనీ ఉద్యోగస్తులే తంటాలు పడతారు. వీరుగాక పన్నులగోల చూడ్డానికి అకౌంటెంటున్నారు - ఆ చట్టం బాగా తెలిసినవారు. నిజానికి కంపెనీలకి లీగల్ అడ్వైజరు అవసరం తక్కువ. అసలు రావుకి 'లా' ఏమన్నా జ్ఞాపకముందో లేదో అనుమానం. ఉన్నా, తెల్ల ప్రభుత్వంనాటి కంపెనీ లా గుర్తుండొచ్చు. ఈ మధ్య స్వతంత్ర ప్రభుత్వం తెచ్చిన మార్పులు చూడ్డానికీ, అర్థం చూసుకోడానికీ అతనికి ఓపికా లేదు. తీరిక అంతకన్నా లేదు.

మామూలు కాగితాలమీద సంతకాలు పెట్టే పనొకటే మిగిలింది ఆ వేళ. ఈ వారం రోజుల చర్చల సారాంశం ఒక రిపోర్టు రాయాలి. అది తీరిగ్గా హోల్ మకాం చేరాక రాయొచ్చు. పరధ్యానంగా కిటికీలోంచి అవతలికి చూస్తూ, సంతకాలు పెడుతూ సాయంత్రం అయిదయిాదాకా గడిపేశాను. ఆఫీసు మూసేసే వేళయినా కుర్చీలోంచి లేవబుద్ధి కాలేదు. అవతల పెరెడ్ గ్రౌండ్ అంచుని తురాయి చెట్టు ఆకు కనిపించకుండా పూసింది. నల్లని, ఆకుపచ్చని, ఎర్రని, తెల్లని కార్లు వచ్చి ఆగుతున్నాయి. కొన్ని ఆగినవి బయలుదేరి పోతున్నాయి - వెనుకటి సైలెంట్ పిక్చర్లలో దృశ్యాల్లాగ ఆఫీసంతా ఎయిర్ కండిషన్ చేసిన మూలాన్ని బయటి చప్పుళ్లు లోపలికి వినపడవు. అసలు బెంగుళూరులో ఎయిర్ కండిషనింగ్ ఎందుకు? కంపెనీకి ఒళ్ళు వాచిగాని? అసలు బెంగుళూరే ఎయిర్ కండిషన్ చేసినట్టుంటుంది. అయితే ఇది వెనుకటి బెంగుళూరు కాదు. అప్పటి ప్రశాంత గాంభీర్యం ఇప్పుడు లేదీ పట్టణానికి. అవతల వీధులలో ఒకటే జనం, జనం, జనం. రకరకాల కంపెనీ బస్సులు, లారీలు, చప్పుళ్లు నేలమీద నింగిమీదా మహా గోలగా అయిపోయింది బెంగుళూరు. నిట్టూర్చి లేచాను.

దేశం నాలుగు మూలలనించీ వచ్చిన మా సహ ఉద్యోగులందరికీ నామీద ఒక రకమైన గౌరవం, ఈర్ష్య. మానేజింగ్ డైరెక్టరు ఎప్పుడూ నన్నే సలహా లడుగుతాడు. నిన్న ఆఖరురోజు మీటింగులో అతిధారాళంగా అన్నాడు.

"మిస్టర్ గోపాలరావు నిజానికి మన కంపెనీకి వెన్నెముక. ఆయన వ్యాపారాన్ని అభివృద్ధి చెయ్యడానికి మద్రాసులో ఎన్ని అద్భుతమైన మార్గాలు అవలంబించారో మీరంతా విన్నారు. మీరందరూ ఆయన అడుగు జాడల్లో నడవాలి. అయన చాలా అదృష్టవంతులు. ఆయన భార్యా, పిల్లలూ ఒక ఆదర్శకుటుంబం. ఈ సందర్భంలో ఒక ప్రకటన చెయ్యమని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నన్ను ఆదేశించాడు. మిస్టర్ గోపాలరావు ఇకమీద కంపెనీ డైరెక్టర్లలో ఒకడు."

ఎంతసేపు చప్పట్లు కొట్టారో అంతా. ఆ సాయంత్రం మా ఆవిణ్ని తప్పకుండా పార్టీకి తీసుకురమ్మని మానేజింగ్ డైరెక్టరు ఎందుకు ఫోన్‌చేశాడో నా కంతవరకూ అర్థం కాలేదు. నాకింది ఉద్యోగులంతా కలసి, జ్ఞాపకార్థం నాకొక టై పిన్నూ – బంగారపుది, మా ఆవిడకొక రిస్టువాచీ బహుమతి ఇచ్చారు. రెండూ మా సింగపూర్ ఏజంటు వొచ్చేటప్పుడు తెచ్చాడట. అలాంటివి ఈ దేశంలో దొరకవట. అందులో మా సుచీ రిస్టువాచీ మహ బాగుంది. నయాపైసంత ఉంది. అయితే ఏ పక్కనుంచి చూసిన అంకెలూ, ముళ్ళూ పెద్దవిగా కనిపిస్తాయి, పైనున్న లెన్సులాంటి గాజుమూత మూలంగా. కట్టుకున్న చీర రంగుతో మాచ్ అయిలాగ పెట్టుకోడానికి, తొమ్మిది స్ట్రాపులున్నాయి. చిత్రం ఏమంటే, ఏ రంగు స్ట్రాపు పెడితే, వాచీ ఆ రంగుతో మెరుస్తుంది. అన్నట్టు వాచీ కాస్త మెల్లగా పోతుందని సరిచేయించుకు రమ్మని ఇచ్చింది సుచీ. అది ఆఫీసు డ్రాయర్లో మరిచి పోయాను. మెట్లు దిగుతున్నవాడిని వెనక్కి వెళ్ళి డ్రాయర్లో ఉన్న వాచీ, పెట్టెతోసహా కోటుజేబులో పెట్టుకుని మెట్లు దిగుతున్నాను. అప్పుడనిపించింది – నేను రావులాగ బాధ్యత తెలికుండా తిరిగితే నాకీ గౌరవమర్యాదలు కంపెనీలోనూ, బయటా, ముఖ్యంగా ఇంట్లోనూ ఉండేవా అని. అసలు రావుకీ గౌరవ మర్యాదలమీద గౌరవమే లేదనుకోండి.

"మీ మానేజింగ్ డైరెక్టరుతో సాయంకాలం పార్టీ లేమిట్రా? అందరూ బిగుసుకుపోయి, అర్థంలేని చిరునవ్వులు అట్టముక్కల్లా మొఖానికి అతికించి వాడితో ఇచ్చకాలాడుతుంటే, తాగుతున్న విస్కీ నీరైపోదూ? వాడికన్న మా అపరంజితోటి బృందావనంలో కూచుంటే, ఇహం పరం" అంటూంటాడు రావు.

'అపరంజి' వాళ్ళ పాలేరు కూతురు అప్పలమ్మ. బృందావనం, మావిడితోటలో ఉన్న పర్ణకుటీరం. రావు చెప్పిందాంట్లో కొంత సబబుందని అంతరాత్మకి తోచినా, సభ్యతకు పట్టాభిషేకం చేసిన నా మనస్సు దాన్ని పూర్తిగా అంగీకరించలేదు. ఇంతకీ రావు వేరూ, నేను వేరూ అని నిర్ణయించుకుని మా ఆఫీసు గుమ్మంలో నిలబడ్డాను. మా కారు గిర్రున తిరిగి పోర్టికోలోకి వొస్తుంటే – పరధ్యానంగా ఇటూ అటూ చూస్తున్నాను.

దయ్యాన్ని గురించి తలుచుకుంటే దయ్యమే ప్రత్యక్షమయిందట. మా కారొచ్చి ఆగింది. అందులో డ్రైవర్ సీట్లో మూర్తీభవించాడు రావు. నేను బిక్కచచ్చిపోయాను.

"రా ఎక్కు" అన్నాడు – నా కార్లోకి నన్నే ఆహ్వానిస్తూ. "చూడు డ్రైవర్, అయ్యగారి కోటు తీసికెళ్ళి అమ్మగారి కిచ్చేయ్యి. ఈ రాత్రి ఈయన కోసం ఓ పెద్ద విందు ఏర్పాటు చేశారు. అంచేత అలస్యంగా ఇంటికి వస్తారని చెప్పు. ఏవిటాలోచిస్తున్నావు? అవతలంతా కాచుకుని ఉంటారు మనకోసం, కోటు వాడి చేతికిచ్చి ఎక్కు" అంటూ తోచనివ్వలేదు.

"కోటెందుకు తీసెయ్యడం" అన్నాను నేను.

"డిన్నర్ జాకెట్ తోడుక్కోవాలి. మర్యాదస్తుల పార్టీకే ఇది. ఆ తరవాత కాస్త బాల్‌రూం డాన్సు – ఆ తరువాత..."

ఆ తరువాతేమిటో రావు చెప్పలేదు, నేనడగలేదు. అయితే మా డ్రైవర్ పాపం మహానమ్మకస్తుడు. అందులో రావు సంగతి బాగా తెలిసినవాడు. మా ఆవిడ దగ్గర మా ఇద్దరి గౌరవం కాపాడేవాడే.

"మరి నా డిన్నర్ జాకెట్టు హోటల్లో ఉంది" అన్నాను నేను.

"బెంగుళూరులో అదొక్కటేనా డిన్నర్ జాకెట్టు? వెనకాల సీట్లో చూడు" అన్నాడు రావు.

వెనకాల సీట్లో రెండు డిన్నర్ జాకెట్లు చక్కగా మడతపెట్టి ఉన్నాయి.

"చూడు డ్రైవర్! అదిగో ఆ ఎర్రకారుందే, దాన్ని మా కారు వెనకాలే తోలుకురా."

"చిత్తం" అని డ్రైవరు ఆ రెండో కారు దగ్గరకు వెళ్ళాడు.

"ఎవరిదా కారు" అని అడిగాడు.

"చెప్తా" అంటూ నా కారుని అరవైమైళ్ల స్పీడులో రోడ్డుకి అడ్డంగా వెనక్కి తిప్పాడు. ఆ తరవాత ఇంక ప్రశ్నలడగడం మానేశాను. మా ఆవిడతో ఏమని చెప్పాలో ఆలోచించుకుంటూ కూచున్నాను.

ఊరు వదిలి ఎటొచ్చామో, ఎంత దూర మొచ్చామో నాకు తెలియదు. మా కారు ఒక తోట మధ్య బంగళాముందు ఆగింది. లోపల్నించి కిలకిల నవ్వులు వినపడ్డాయి. నేను డిన్నర్ జాకెట్టులోకి మారాను. కోటు జేబులో సామానంతా కంగారుగా నా జేబుల్లోకి మార్చుకున్నాను. కారు వెనకసీట్లో కోటు పారేసి రావు వెనకాలే లోపలికి వెళ్ళాను. రావు తన డిన్నర్ జాకెట్టు, చేతిమీద వయ్యారంగా వేసుకుని లోపలికి నడిచాడు.

"హల్లో, హల్లో" అంటూ కొన్ని గొంతుకలు మా ఇద్దరినీ ఆహ్వానించాయి. ఆకస్మాత్తుగా ఒక మెత్తని చెయ్యి నా కరస్పర్శ చేసింది. కళ్ళెత్తి చూశాను.

బాబ్డ్ హెయిర్ అంత బాగా సహజంగా నప్పిన మొహం – మన దేశ స్త్రీలలో ఇంకెవరికీ ఉండదు. ఆమె ఎత్తు మడమల జోళ్ళనడక, చిన్న వంకర నవ్వులో మెరిసే లిప్‌స్టిక్ పూసిన పెదవులు, చేతుల్లేని జాకెట్టులో కదలికలూ, నల్లగా దిద్దిన కనుబొమలకింద ఏదో కొంటెతనంతో మెరిసే కళ్ళూ, అన్నీ అతి సహజంగా ఆ మూర్తిలో అతుక్కుపోయాయి.

"రావు మిమ్మల్ని గురించి చాలా చెప్పాడు" అంది – అందులో చమత్కారం ఏమన్నా ఉందేమో తెల్చుకోవాలని.'

"ఏం చెప్పాడు." అని అడిగాను.

"ఒక్కమాటలో ఎలా చెప్పడం?" అంది ఆమె.

"అన్నట్టు, మిసెస్ జైకిషన్" అని పరిచయం చేశాడు రావు. జైకిషన్ ఎవడో ప్రపంచ విఖ్యాత పురుషుడన్నట్టు.

ఆ తరువాత ఏం జరిగిందో వివరాలు నాకూ గుర్తులేవు. అంతా అతిమర్యాదగా మాత్రం జరిగిపోయింది. కాక్‌టేయిల్స్ అంతులేకుండా వొచ్చాయి ఎక్కణ్నించో. పక్కనొక

రికార్డ్ ప్లేయర్ పాశ్చాత్య సంగీతం మోగిస్తోంది. కాస్త వేడెక్కిన తరువాత ఆడ, మగ జంటలుగా విడిపోయి డాన్సు మొదలెట్టారు. మిసెస్ జైకిషన్ అందరితోటి డాన్సు చేసింది – నాతో కూడా. రావు అందరితోటి డాన్సు చేశాడు. మిసెస్ జైకిషన్ అతనూ డాన్సు చేస్తుండగా ఆమె అరిచింది – సగం నవ్వుతూనే.

"రావ్! నా మోకాళ్ళూ, కాలివేళ్లూ పచ్చడైపోయాయి. ఏవిఁటీ డాన్సు" అంది.

"ఇది భరతనాట్యం" అన్నాడు రావు. అదొక్కటే కాస్త శ్రుతి మించిన కులాసా– ఆ విందులో.

ఆకస్మాత్తుగా మా కంపెనీ డైరెక్టర్లు దిగారు ఎక్కణ్ణించో.

"హలో – గోపాల్రావ్" అంటూ నా కరచాలనం చేశారు. అప్పటికే కాస్త పైమెట్టులో ఉన్న నాకు వాళ్ళు కన్ను గీటినట్టు అనుమానం. వాళ్ళంతా మిసెస్ జైకిషన్‌ని ఆప్యాయంగా – అతి అప్యాయంగా పలకరించారు. ఆమె ప్రసిద్ధురాలే అనుకున్నాను.

మొత్తంమీద భోజనం అయేసరికి నేను ఏడవ స్వర్గానికి దగ్గర్లో ఉన్నాను. అసలీ పార్టీ, విందు ఎవరు ఏర్పాటు చేశారో నాకింతవరకూ తెలీదు. రావుని ఎప్పటికప్పుడు అడుగుదామనుకుంటుండగానే, ఇలాంటి చచ్చు ప్రశ్నలడిగే స్థితి దాటిపోయింది.

రాత్రి ఏ పన్నెండో అయింది. ఎవరో కొందరు వెళ్ళిపోయారు. కొందరు సోఫాల్లో పడుకొని కళ్ళు మూశారు.

నేను బయట వరండాలో కొచ్చేసరికి అర్థరాత్రి చలిగాలి సుఖంగా నుదుటికీ కళ్ళకీ తగిలింది. బయట నా ఒక్క కారే వుంది. చటుక్కుని నా కారు హారన్ మోగింది. దగ్గరగా వెళ్ళాను. మిసెస్ జైకిషన్ ఉంది ముందు సీట్లో.

"ఏం గోపాల్, ఇంతసేపూ ఏం జేస్తున్నావు? నీ కోసం ఎంతసేపిక్కడ కాచుకుని కూచోమంటావు?" అంది గారంగా, సగం మత్తుగా.

"రావు ఏడీ?"

"నా కారు పట్టుకుపోయాడు పనుందని. నువ్వు దిగపెడతావని చెప్పాడు."

ఇప్పుడర్థమైంది నన్నీ మర్యాదస్థుల పార్టీ కెందుకు తెచ్చాడో! కార్లో ఎక్కి స్టార్టు చేశాను. మలువు తిప్పేటపుడు ఆమె నా మీదికి బరువుగా ఒరిగింది.

"సారీ" అంది.

"ఫరవాలేదు" అన్నాను.

నాకెటు పోవాలో తెలీదు. ఆమె నడిగాను. ఎడం పక్కకి చెయ్యి చూపించిందామె. కారు అటు తిప్పాను.

"మీ ఇల్లెక్కడ?"

"ఈ రాత్రి నేనింటికి పోను" అందామె.

"మరెక్కడికి"

"మీ హోటల్‌కి"

నాకు చటుక్కుని ముచ్చెమటలూ పోశాయి. కారు ఆపాను.

"చూడండి" అన్నాను.

"ఊఁ" అంటూ మగతగా నా భుజంమీదికి వాలింది.

"మీ ఇల్లెక్కడో చెప్పండి."

"నాకు గుర్తేలేదు. నీ ఇష్టం ఎక్కడికి పోయినా సరే" అంది.

"అది కాదండీ!"

"ఏది కాదు?" అంటూ మత్తుగా, గారంగా కిలకిల నవ్వింది.

రావు నన్నీ ఇరుకుల్లో పెట్టడానికే ఇంత పన్నాగం పన్నాడని ఇప్పుడర్థమయింది. ఎన్ని విధాల నచ్చ చెప్పడానికి ప్రయత్నించినా ఆమె నవ్వుతుంది. తప్ప సరిగ్గా సమాధానం చెప్పదు. ఆఖరుకి విసుగెత్తింది. నాకు.

"చూడండి, హోటల్లో నా భార్యుంది. మిమ్మల్ని అక్కడికి తీసుకుపోడానికి వీల్లేదు."

"ఏం?"

"ఏం ఏమిటి? మీకోసం నా కాపరం నడి వీధి కెక్కించుకుంటానా?"

ఆమె కిలకిల నవ్వింది.

"రావు వినాల్సిందీ ముక్కలు" అంది వ్యంగ్యంగా.

తేలికయిపోయానని గ్రహించాను. ఆమె దగ్గర ఆ మాట అనకుండా ఉండాల్సింది. అయితే ఇప్పుడీ దెయ్యాన్ని ఎలా ఒదుల్చుకోడం. మొదట చూసినప్పుడు మంచీ మర్యాదా, హుందా, అందులోనే కాస్త హుషారుగా అన్నీ చూసి, స్నేహ పాత్రురాలనుకున్నాను. నాలుగు పెగ్గులు లోపల పడగానే, కొరకరాని కొయ్యైపోతుందని ఎరగను.

"టైమెంతైందో చూశారా?" అన్నాను కారు లోపలి లైటు వెలిగిస్తూ.

"టైమా?"అంటూ తన బాగ్‌లోంచి ఒక పెట్టె తీసింది.

నా గుండె గుభేలుమంది. మా ఆవిడ గడియారం అది.

నా జేబులు తడిమి చూసుకున్నాను. నా పర్సు పక్కని సీటుమీద పడి ఉంది. మా సుచీ గడియారం పెట్టె లేదు. ఇలాంటి గడియారాలు ఈ దేశంలో దొరకవన్నాడు సింగపూర్ ఏజెంట్.

"ఎక్కడిదా గడియారాం?" అన్నాను కొంచెం కర్కశంగా.

"దొంగ వ్యాపారస్థుల దగ్గర కొన్నా" అంది మూసుకుపోతున్న కళ్ళెత్తి నా వంక చూస్తూ.

"నువ్వే దొంగవు. ఆ గడియారం ఇలా గియ్యి. మర్యాదగా ఇలా ఇయ్యి" అన్నాను.

మిసెస్ జైకిషన్ ఆ మత్తులోనే ఆశ్చర్యంగా నా వంకచూసింది.

"ఏమిటి?" అంది.

"ఆ రిస్టువాచీ ఇలా గిస్తావా బలవంతంగా తీసుకోవాలా."

ఆమె బిత్తరపోయి చూసింది నావంక

ఆమె చేతిలో గడియారాన్నీ, పెట్టెనీ ఒక్క ఊపులో లాగేశాను. వంగి తలుపు తెరిచాను – ఆమె వేపుది.

"పో, అవతలికి దిగుతావా గెంటెయ్యమన్నావా?" అంటూ అన్నాను.

"రోగ్, బీస్ట్" అంది ఆమె కోపంతో వొణికిపోతూ. ఆమెకూ తిక్క దిగిపోయి ఉంటుంది. ఒక్క నెట్టులో ఆమెను అవతలకి గెంటేసి, రైమని కారు తోలేశాను. ఆమె వంక తలుపు దానంతట అదే మూసుకుపోయింది.

ఎంత ధైర్యం! దొంగ సొమ్ము నా ఎదుటే ఎంత ధైర్యంగా పైకి తీసింది. ఎంత గుండెలు తీసిన బంటు! రావుగారికి దీని సంగతి రాయాలి. కొంత ఆవేశం తగ్గాక అనిపించింది. ఆ రిస్టువాచీ నా భార్యకి ఎవరో ఇచ్చిన ప్రెజెంటని ఆమెకేం తెలుసు? మెల్లగా వేళాకోళానికి తీసి, నేను సుముఖంగా ఉంటే అది కొట్టేద్దామనుకుందేమో పాపం. ఊరికి అయిదారు మైళ్ళదూరంలో వొదిలేశాను. ఎల్లా చేరుకుంటుంది తనింటికి? పోనీ వెనక్కి వెళ్ళి ఎక్కించుకుందామా అని ఒక ఆలోచన వచ్చింది. మళ్ళీ వొదిలి పోయిన శనిని తగిలించుకోడ మెందుకనిపించింది. వెంటనే. అయినా ఆ బజారు - చవక బజారు - దాని కోసం నాకెందు కింత ఆత్రం!

కారు పోర్టికోలో వొదిలేసి, మెల్లగా మేడ మెట్లెక్కాను. గది తలుపు దగ్గరగా వేసి ఉంది. తోశాను. పక్కకి ఒత్తిగిల్లింది సుచీ. పక్కని కూచున్నా మంచంమీద. జరిగినదానికి సముజాయిషీ చెప్పుకోడానికి నేను మొదలెట్టకుండానే సుచీ అంది.

"ఇప్పుడే రావుగారొచ్చి పలకరించి వెళ్ళారు. మీరెవర్నో ఫ్రెండ్సుని దింపడానికెళ్లారని చెప్పారు. పెద్ద విందటగా"

ఎప్పుడు భార్యలకి అబద్ధాలు చెప్పవలసి వచ్చినా నిజానికి సాధ్యమైనంత దగ్గర్లో వాటిని అట్టేపెట్టాలని రావు సిద్ధాంతం. పెద్ద విందుమాట నిజమే. నేను స్నేహితుణ్ని దిగబెట్టడానికి వెళ్ళిన మాట నిజమే. ఎటొచ్చీ స్నేహితురాలు - అంతే. అంత సులువుగా సముజాయిషీ తేలిపోయినందుకు రావుకి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకుంటూ గుడ్డలు మార్చుకోడానికి లేచాను.

నిద్రమత్తు కళ్ళని తుడుచుకోడానికి సుచీ ఎడంచెయ్యి ఎత్తింది.

ఆ చేతిన తళతళ మెరిసింది ఆమె రిస్టు వాచీ! నా గొంతు చటుక్కుని ఎండిపోయింది.

"ఆ వాచీ... " అన్నాను.

"డ్రైవరు మీ కోటు తెచ్చాడుగా జేబులో ఉంది. మీ టైమెంత?" అంటూ నా ఎడం చేతిని తిప్పి రెండు గడియారాలూ సరిచూసింది.

"సరిగ్గా తిరుగుతున్నట్టుంది" అని పడుకుంది.

వొచ్చే వికారాన్ని ఆపుకోడానికి తొందరగా బాత్ రూంలోకి పోయాను. కుడిచేత్తో కోటుజేబు తడిమాను. మిసెస్ జైకిషన్ రిస్టువాచి తేలులా చేతికి తగిలింది.

"ఓయి భగవంతుడా. ఇప్పుడేమి దారి? ఎంత దారుణం చేశాను! ఎంత ఘోరమైన నేరం! నేను - మిస్టర్ గోపాలరావుని - కంపెనీ కొత్త డైరెక్టర్ని... ఇప్పుడేమిటి దారి?"

ఆలోచనలు రాకెట్టులా దూసుకు పోతుంటే కుళాయి తిప్పి, తల కింద పెట్టాను. ఆఖరికి మిగిలింది ఒక్కటే ఆలోచన-

నన్నీ సుడిగుండంలోంచి బయట పారెయ్యడం భగవంతుడివల్ల కూడా కాదు. ఒక్క రావే నన్ను రక్షించగలడు. ఒక్క రావే-

**(ఆనందవాణి: దీపావళి 1969)**